రాజు అందుకు ఒప్పుకుని మళ్ళీ అడిగాడు.

"ఆత్మ కంటికి కనబడక పోవడం ఏమిటి? దానికీ ఓ దృష్టాంతం చూపించండి."

గురువు ఓ నీటిపాత్రని, ఉప్పుని తెప్పించాడు. ఉప్పుని ఆ నీటిలో పోయమని రాజుకి చెప్పాడు. అది కరిగాక అడిగాడు.

"ఉప్పు కంటికి కనబడుతోందా?"

"లేదు. అది పూర్తిగా నీళ్ళలో కరిగిపోయిందిగా." చెప్పాడు రాజు అసక్తిగా.

"కంటికి కనబడకపోయినా ఆ ఉప్పు నీటిని ఎలా ఆవరించుకుని ఉందో, అలాగే ఆత్మ కూడా ఈ ప్రపంచాన్నంతా ఆవరించుకుని ఉంది."

"ఇప్పుడు నాకు ఆత్మ స్వరూపం ఎలాంటిదో పూర్తిగా అర్థమైంది." తృప్తిగా చెప్పాడు రాజు.

## 26. మూడో మనిషి

గుండె శస్త్రచికిత్సలో ఓ సర్జన్‌కి గొప్ప నైపుణ్యం ఉంది. ఆయన కొన్నివేల ఆపరేషన్లు చేసాడు. దాదాపు అన్నీ విజయవంతం అవడంతో ఆయన హస్తవాసి మంచిదని, రోగికి ఢోకా లేదని, త్వరగా కోలుకుంటాడని ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

ఆయన్ని టివి, పత్రికలు ఎప్పుడు ఇంటర్వ్యూ చేసినా తన విజయానికి కారణం తను కానీ, రోగి కానీ కాదని ఓ మూడో మనిషని సమాధానం చెప్పసాగాడు. ఐతే ఆ మూడో మనిషి ఎవరన్నది ఆయనెప్పుడూ స్పష్టంగా చెప్పలేదు. ఆ ప్రశ్నకి జవాబు దాటవేస్తూంటాడు.

ఓ పెద్ద పారిశ్రామికవేత్తకి హృద్రోగం వచ్చింది. ఆయన ఈ సర్జన్ చేత ఆపరేషన్ చేయించుకోవాలనుకున్నాడు. ఆయన దగ్గరకి వెళ్ళి తన

రిపోర్టులన్నీ చూపించాడు. ఆపరేషన్ తప్పదని గ్రహించిన సర్జన్ ఆయనకో డేట్ ఇచ్చాడు. దానికి ముందురోజు పారిశ్రామికవేత్త ఆసుపత్రిలో చేరాడు. సర్జన్‌ని భయంగా అడిగాడాయన.

"ప్రమాదమేమీ వుండదు కదా? ఆపరేషన్ సక్సెస్ అవుతుందిగా?"

చిన్నగా నవ్వి చెప్పాడు సర్జన్.

"భయంలేదు. అంతా బాగా జరుగుతుంది. నేనే కాక మరొకరు కూడా సహాయం చేస్తారు కదా!"

ఆపరేషన్ విజయవంతమైంది. తనని చూడడానికి వచ్చిన సర్జన్‌ని అడిగాడా రోగి.

"నేనో చిన్న ప్రశ్న అడుగుతాను. దయచేసి జవాబు చెప్తారా?"

"చెప్తాను. అడగండి."

"నా ఆపరేషన్ విజయవంతం అవడంలో మీకు ఎవరో మూడో మనిషి సహాయం చేస్తారన్నారు. కానీ ఆపరేషన్ గదిలో మీరు తప్ప మరో సర్జన్ ఎవరూ నాకు కనిపించలేదు. ఆ మూడో వ్యక్తి ఎవరు?"

"ఈ ప్రశ్నకి ఎవరికీ చెప్పని జవాబు మీకు చెప్తున్నాను. ఆ మూడో వ్యక్తి భగవంతుడు. సర్జన్‌గా నా నైపుణ్యం ఒక్కటే సరిపోదు. దానికి దేవుని కృప కూడా కావాలి. అప్పుడే నేను నా కర్తవ్యాన్ని విజయవంతం చేయగలను. నా ప్రతీ విజయానికి కారణం ఆ అదృశ్య మూడో వ్యక్తి కృప అనే నేను గాఢంగా నమ్ముతాను." ఎంతో విశ్వాసంతో చెప్పాడాయన.

## 27. ప్రార్థన ఫలితం

ఓ కొండకి ఆనుకుని వున్న ఓ పురాతన ఆలయం ట్రస్టీలు సమావేశమయ్యారు. గుడికి వచ్చే భక్తుల తాకిడి అధికమవుతూండడంతో అదనంగా వసతి గృహనిర్మాణం విషయం వారు చర్చించారు.